క్లుప్తంగా

రెండు రోజులు నీటి సరఫరా బంద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో 1 నుంచి 50 డివిజన్లకు ఈ నెల 28, 29 తేదిల్లో తాగునీరు సరఫరా ఉండదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జి.టి.రోడ్డులో ప్రధాన పైపు లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సరఫరా బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలంతా గమనించి సహకరించాలని కోరారు.

పూడికతీత పనులు పూర్తి


మడ్డువలస కాలువ పనులను పరిశీలిస్తున్న డీఈ ఈశ్వరప్రసాద్

జి.సిగడాం: పెంట గ్రామ పరిధిలో మడ్డువలస కుడి ప్రధాన కాలువ పూడికతీత పనులు గురువారం పూర్తయ్యాయి. నీటి యాజమాన్య సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను మడ్డువలస ప్రాజెక్టు డిప్యూటీ డీఈ ఈశ్వర ప్రసాద్ పరిశీలించారు. పెంట గ్రామం నుంచి మెట్టవలస బ్రిడ్జి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కాలువలో తీసిన పూడికతీత పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్ నాటికి రైతులకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మిగతా పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట ఏఈఈలు రాజశేఖర్, నాగేంద్ర ఉన్నారు.

విశిష్ట ప్రదేశం శృంగేరి పీఠం


ప్రసంగిస్తున్న సంతోష్‌కుమార్

శ్రీకాకుళం కల్చరల్: ఎంతో విశిష్టమైన ప్రదేశంగా శృంగేరి పీఠం నిలుస్తుందని మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనాపాటి అన్నారు. బాపూజీ కళామందిర్‌లో శృంగేరి ఉభయ జగద్గురువుల పరిపూర్ణ అనుగ్రహంతో అహం బ్రహ్మాస్మి సీఈవో పి.ఎ.మురళి నిర్వహణలో శ్రీశంకర విజయంపై ప్రసంగం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరాచార్యులు మాతృదేవో భవ సందేశాన్ని ఆచరణాత్మకం చేశారని, తల్లికి ఇచ్చిన మాట ప్రకారం అంత్యక్రియలు చేశారని వివరించారు. కార్యక్రమంలో పెంట రామచంద్రశేఖరశర్మ, అహం బ్రహ్మాస్మి వలంటీర్ వాశిష్ట కార్తికేయశర్మ, గుమ్మా నగేష్, నిష్టల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న వైద్యులు, అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): క్రమం తప్పకుండా యోగా చేస్తూ సరైన ఆహారపు అలవాట్లు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అన్నెపు శశిధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో రెవెన్యూ అతిథి గృహం ఆవరణలో గురువారం యోగా కార్యక్రమం నిర్వహించారు. రోజులో కనీసం 30 నిమిషాలు యోగ సాధన చేయడం ద్వారా అనేక రోగాల నుంచి సులువుగా బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండవల్లి రవి, అంధవరపు రమేష్, డాక్టర్ లక్ష్మీకాంత్, బొత్స శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు శ్రీనివాసరావు, మెట్ట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం


విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు ప్రసంశనీయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ సమకూర్చిన రూ.6 లక్షల విలువైన పరుపులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు ముని శ్రీనివాస్, సెక్రటరీ దూసి సంతోష్, సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి

రణస్థలం: గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నామని మండల పశుసంవర్థక శాఖ ఏడీఏ బి.దుర్గారావు తెలిపారు. పైడిభీమవరంలో గురువారం గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహ్య, అంతర పరాన్న జీవులు గొర్రెలు, మేకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని, దీనివల్ల జీవాలు బరువు తగ్గడం, పొట్ట లావుగా ఉండటం, ఏలిక పాములు, బద్దె పురుగులు, జలగలు పట్టడం, పోషక లోపం ఏర్పడతాయని చెప్పారు. ఈ సమస్యలు అధిగమించేందుకు నట్టల నివారణ మందులు విధిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్థక అధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

వస్తున్నాయ్ అదుగో..

జగన్నాథ రథచక్రాలు


బొందిలీపురంలో జగన్నాథ మఠం

- నేటి నుంచే రథయాత్ర ఉత్సవాలు
- నగరంలో పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- మారు రథయాత్రకు వరకు కొనసాగనున్న ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: సర్వజగత్తులకు అధిపతి.. పతిత పావనుడు.. దీనజన బాంధవుడు జగన్నాథుడు. శాంతి సమానత్వం, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తూ సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే జగన్నాథుని అవతారంలో వెలిసి భక్తుల కల్పతరువుగా నిలిచాడని ప్రతీతి. నేడు జగన్నాథుని రథయాత్ర. శుక్రవారం ఆషాఢ శుక్ల పక్షమి సందర్భంగా రథచక్రాలు కదలనున్నాయి. ఇందుకు నగరంలోని గుజరాతిపేట, ఇలిసిపురం ప్రాంతాల్లోని ప్రఖ్యాత జగన్నాథ స్వామి ఆలయాలతో పాటు మొండేటివీధి, పాండ్రంగివీధుల్లోనూ ఘనంగా రథయాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇలిసిపురంలో..

రైతుబజారు కూడలిలోని ఇలిసిపురం కూడలి వద్ద గుడించా మందిరం వద్ద నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ఒడిశా రాష్ట్రంలోని పూరీ దేవాలయం తరహాలో సంప్రదాయబద్ధంగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయి. శుక్రవారం బొందిలీపురం నుంచి రథంపై స్వామివారు ఊరేగింపుగా గుడించా వద్దకు చేరుకుంటారు. మరుసటి రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు రోజుకొక వేషధారణలో జగన్నాథుని దర్శనం భక్తులకు ఏర్పాటు చేస్తారు. 1న హీరాపంచమి సందర్భంగా లక్ష్మీదేవిని మేళతాళాలతో ఊరేగింపు నిర్వహిస్తారు.

గుజరాతీపేటలో..

దేవదాయశాఖ పరిధిలో నిర్వహిస్తున్న గుజరాతిపేట జగన్నాథ స్వామి దేవాలయంలో ఈ నెల 27 నుంచి జూలై 7 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. 27న స్వామివారిని ఊరేగింపుగా రథంపై ఉంచి గుడిశనగుళ్ల వద్దకు తీసుకువెళతారు. మరునాటి నుంచి ప్రతిరోజూ ఒక అవతారంతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. 1న హీరాపంచమి సందర్భంగా అమ్మవారి పల్లకీ ఊరేగింపు, 7న మారు రథయాత్ర నిర్వహిస్తారు. ఇందుకోసం నూతనంగా పల్లకినీ కూడా సిద్ధం చేశారు.

మురపాకలో..

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఏటా ఇదే పెద్ద పండగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులంతా స్వామివారిని దర్శించుకుని తరిస్తారు. బంధువులు, పరిసర గ్రామాల ప్రజలతో ఇక్కడ సందడిగా ఉంటుంది.


గుజరాతిపేటలో నేత్రోత్సవ పూజలు


బొందిలీపురంలో నేత్రోత్సవ పూజలు

ఘనంగా జగన్నాథుని నేత్రోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేటలో జగన్నాథస్వామి దేవాలయంలో గురువారం నేత్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట సత్యనారాయణ, రాజగోపాల్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని నిద్రలేపి వేదికపై ఉంచి కళావహనం చేసి పూజలు చేశారు. బొందిలీపురంలోని జగన్నాథస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి నేత్రోత్సవం ఘనంగా జరిగింది. మఠాధిపతి లక్ష్మీధరదాస్ బావాజీ ఆధ్వర్యంలో జగన్నాథుడు, సుభద్ర, బలభద్ర స్వామివారికి కళావాహనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


జగన్నాథస్వామి విగ్రహాలు


మురపాకలో ముస్తాబైన జగన్నాథుని ఆలయం


గుజరాతిపేట జగన్నాథుని ఆలయం


గుజరాతిపేటలో అమ్మవారి పల్లకి


బొందిలీపురంలో జగన్నాథ రథం

ఉద్యమస్ఫూర్తి గేయం వందేమాతరం


బంకించంద్ర చటర్జీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ప్రతి భారతీయుని గుండెలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గేయం వందేమాతరం అని పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర చటోపాధ్యాయ 187వ జయంతి సందర్భంగా గురువారం శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో గాంధీమందిరం స్మృతివనంలో బంకించంద్ర చటోపాధ్యాయ విగ్రహానికి గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు నిక్కు అప్పన్న, జామి భీమశంకరరావు, మందుల మోహనరావు, నటుకుల మోహన్, చింతాడ కృష్ణమోహన్, కొంక్యాణ వేణుగోపాల్, మెట్ట అనంతభట్లు, తర్లాడ అప్పలనాయుడు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పిన్నింటి రజిని

రణస్థలం: మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని రణస్థలం ఎంపీపీ పిన్నింటి రజిని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ఆహ్వానితులు పిన్నింటి సాయికుమార్ ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తల్లికి వందనం చాలామందికి అందలేదని సభ్యులు ఎంఈవో ఎ.త్రినాథరావును నిలదీశారు. ముఖ్యంగా కరెంట్ బిల్లులు, మీటర్ల అనుసంధానం సమస్యలతో పథకం నిలుపుదల చేయడంపై విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. గుండె సంబంధిత హార్ట్ స్ట్రోక్‌కు సీహెచ్‌సీలో రూ.40వేలు విలువైన ఇంజక్షన్ ఉచితంగా అందజేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.లలిత తెలిపారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అన్నమయ్య సంకీర్తన గాన యజ్ఞం

శ్రీకాకుళం కల్చరల్: స్వరాత్మిక సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనా గాన యజ్ఞం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకులు, గాయకులు కె.వి.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9 వరకు 41 రోజుల మండల దీక్షాకాలంగా 600 సంకీర్తనలతో 41 దేవాలయాలలో సంకీర్తనా గానం ప్రతి రోజూ సాయంత్రం 6గంటలకు మొదలవుతుందని పేర్కొన్నారు.

తొలుత డీసీసీబీ కాలనీలోని భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సంకీర్తనా గానంతో ప్రారంభమవుతుందని తెలిపారు.

సందడిగా బ్యూటీషియన్ డే


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో పలుచోట్ల గురువారం అంతర్జాతీయ బ్యూటీషియన్స్ డే ఘనంగా నిర్వహించారు. స్టార్ బ్యూటీస్ గ్రూప్ అడ్మిన్, బ్యూటీషియన్ ప్రిస్కిల్లా గిరిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బ్యూటీషియన్లు రాధారాణి, శారదా, కవిత, సంతోషి, సావిత్రి, సంధ్య, వసంత, శాంతి, కృష్ణవేణి, సౌందర్య, సోనియా, మంజుల పాల్గొన్నారు. స్థానిక శ్రీఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకల్లో తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు. బ్లెస్ ఏంజిల్స్ నిర్వాహకులు పడపాన సుగుణారెడ్డి, ప్రియ, మాధురి, రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

యువజన విభాగం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌నాయుడు

ఎచ్చెర్ల: లావేరు మండలం వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా బాలి శ్రీనివాస నాయుడును ఎంపికచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిర్దేశకత్వంలో పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం పలువురు నాయకులు శ్రీనివాసనాయుడును అభినందించారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


గుజరాతిపేటలో వారాహి అమ్మవారికి పూజలు


మొండేటివీధిలో వారాహీదేవిగా లలితాదేవి


బలగ కాలభైరవ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపురసుందరీ దేవీపీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు జరుగుతాయని పీఠం నిర్వాకులు పెంట రామచంద్రశేఖరశర్మ, వశిష్ఠ కార్తికేయశర్మ తెలిపారు. మొండేటివీధిలోని లలితాదేవి సహిత శివకామేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో షిరిడిసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. బలగ నాగావళి తీరంలో ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

క్రీడాకారులు దేశానికి గర్వకారణం


పతకాలు సాధించిన క్రీడాకారులు, హెచ్‌ఎం, పీడీ, పీఈటీలతో కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశానికి గర్వకారణంగా నిలుస్తున్న క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో ఉన్న టంగుటూరి ప్రకాశంపంతులు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ హెచ్‌ఎం పి.ఇందిరామణి నేతృత్వంలో ఇటీవల పలు క్రీడా టోర్నమెంట్లలో రాణించిన క్రీడాకారులు గురువారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కూల్ సదుపాయాలు, సమస్యలను కమిషనర్ హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. మైదానం లోతట్టులో ఉండటం వల్ల ఆటాడేందుకు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలో పరిశీలిస్తానని భరోసా ఇచ్చారు. 2024–25 విద్యా సంవత్సరంలో పాఠశాల నుంచి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వంటి పోటీల్లో సుమారు 20 మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచినట్టు హెచ్‌ఎం వివరించారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–17 ఫుట్‌బాల్‌లో రజత పతకాలు సాధించిన హేమంత్‌కుమార్, హరీష్, సూరజ్‌లను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ సాంబమూర్తి, పీఈటీ ఎల్.ఢిల్లేశ్వరరావు(దిలీప్), ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం


శ్రీకాకుళం న్యూకాలనీ: నినాదాలు చేస్తున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు


శ్రీకాకుళం అర్బన్: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ అధికారులు, సిబ్బంది

రణస్థలం: గంజాయి వంటి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పిలుపునిచ్చారు. జె.ఆర్.పురం సర్వీస్ రోడ్డులో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ గురువారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఉమామహేశ్వరరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: అంతర్జాతీయ మాదకద్రవ్యాల, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా గురువారం మండల స్థాయి అధికారులు, పోలీసులు ఎచ్చెర్లలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, నాయకులు చౌదరి నారాయణమూర్తి, జీరు రామారావు, ఎంపీడీవో హరిహరరావు, సీఐ అవతారం, ఎచ్చెర్ల ఎస్సై సందీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: డ్రగ్స్ అక్రమ రవాణాను నివారించాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాదరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం ఉన్నత పాఠశాల, కొయ్యాం జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోస్టల్ సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్)లోని నాసా ముక్త క్లబ్ ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, ఎన్‌ఎంబీఏ క్లబ్ కోఆర్డినేటర్ ఎల్.కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్.మాధవీలత, ఎస్.రుద్రమరాణి, ఐ.హేమలత, చిన్నారావు, ప్రభాకర్‌రావు, రామకృష్ణ, పీడీ మోహన్‌రాజ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం అవుతుందని జి.సిగడాం ఎస్సై వై.మధుసూదనరావు అన్నారు. మండల కేంద్రం జి.సిగడాంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, ఎంఈవోలు ఎ.రవి, ముఖ్ల శ్రీనివాసరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని కొన్నా వీధి, బర్మా కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి పి.నాగరాణి, కృష్ణాపార్క్ సెక్టార్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.ప్రసన్న, సునీత, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, నాయకులు


ఎచ్చెర్ల: ప్రతిజ్ఞ చేస్తున్న కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, అధికారులు, విద్యార్థులు


జి.సిగడాం: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు


రణస్థలం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై చిరంజీవి

టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపునకు కృషి చేస్తా

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం: రానున్న 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపునకు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నగర అధ్యక్ష పదవికి సంబంధించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పరిశీలకుల సమక్షంలోనే శంకర్ ఆవేదనతో ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో తనకు టికెట్ రాదని కొందరు ప్రచారం చేస్తున్నారని, అలా జరిగినా పర్వలేదన్నారు. తనకు పార్టీయే ముఖ్యం తప్ప, పదవులకు కాదని చెప్పారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తుండడంలో కొన్ని పత్రికలు, చానెళ్లతో పాటు సొంత పార్టీలోనే కొందరు ఉండడం విచారకరమని అన్నారు. జూదం ఆడుతున్న కొందరిని తానే పట్టించానని, కొందరు అంటుంటే పట్టుబడిన వారిని విడిపించడానికి పోలీసుపై ఒత్తిడి తెచ్చానని ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి ప్రచారాలు బాధ కలిగిస్తున్నాయన్నారు. కొన్ని ప్రభుత్వ ఆస్తులను ఎవరికో ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాననడంలో వాస్తవం లేదన్నారు. నగర పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి మాదారపు వెంకటేష్, కోరాడ హరిగోపాల్, పాండ్రంగి శంకర్, ఇప్పిలి తిరుమలరావు, ఒంగటి కృష్ణ, దొండపాటి నవీన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెబుతూ అభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలిపారు. నివేదికను అధిష్టానానికి సమర్పిస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గరికిపాలెం, గొల్లపేట, పిన్నింటిపేట, దన్నానపేట, జె.ఆర్.పురం, భావరాజుపాలెం, రణస్థలం, కమ్మసిగడాం, అర్జునవలస, సంచాం, ఎం.నగరప్పాలెం, నడుకుదిటిపాలెం, తిరుపతిపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాబాకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం : ఆనందపురంలో షిరిడీసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 100 అడుగుల వెంకటి సాయికోటి మహాస్తూపం వద్ద విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.